ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 — 8 పేజీలు

ఎన్‌టిఆర్ — కృష్ణా







సాంస్కృతికోత్సవంలో కళా రూపాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

సాంస్కృతిక సంబరాలు ప్రారంభం



వివిధ అభ్యుదయ సంఘాలు, సంస్థల ఆధ్వర్యాన దసరా సాంస్కృతికోత్సవాలు విజయవాడలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలను మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఐలు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా 'హింసారహిత సమాజం – పర్యావరణ పరిరక్షణ'అనే థీమ్‌పై విభిన్న అంశాలకు సంబంధించి విద్యార్థులు, యువతీయువకులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. థీమ్‌కు అనుగుణంగా మహిళా సమస్యలు, వివక్ష, సమానత్వం, హింస, అక్రమ రవాణా, ఫోర్నోగ్రఫీ, సామాజిక సమస్యలు, మాదక ద్రవ్యాలు, పర్యావరణం, మత సామరస్యం తదితర అంశాలతో కళారూపాలు ప్రదర్శించారు. వందలాది మంది ఈ ప్రదర్శనలో భాగస్వాములయ్యారు.



(పూర్తి వివరాలు మెయిన్, టాబ్లాయిడ్ మధ్య పేజీల్లో)

ఇళ్ల స్థలాలు హుష్ కాకి..!

- ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారుల పట్టాలు రద్దు ?
- ఆందోళనలో వేలాది మంది సామాన్యులు



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

సామాన్యులు ప్రభుత్వ సాయంతో సొంతింటి కలను నెరవేర్చుకుందామనుకున్నారు. స్థలాలకు దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల్లో కేటాయించిన స్థలాలకు పట్టాలు తీసుకున్నారు. పెరిగిన గృహ నిర్మాణ వ్యయానికి అవసరమైన అప్పులు అందక గృహ నిర్మాణాన్ని వాయిదా వేసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఆర్థిక వెసులుబాటు చూసుకుని ఇల్లు నిర్మించుకుందామనుకుంటున్న లబ్ధిదారుల ఆశలు అడియాశలవుతున్నాయి. కాలనీల్లో గృహాలు నిర్మించుకోని స్థలాల పట్టాలను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

కృష్ణాజిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాలకు పట్టాలు, గృహాలు నిర్మించుకోవడానికి తొలుత 93,245 మంది అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. 614 లే అవుట్లలో గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు సెంటున్నర, పట్టణ ప్రాంత లబ్ధిదారులకు సెంటు చొప్పున గత ప్రభుత్వం కేటాయించింది. లబ్ధిదారులకు పట్టాలను అందించింది. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో 297 లే అవుట్లలో 81,300 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చిన్న ఇల్లు నిర్మించుకోవాలన్నా రూ. 6.50 లక్షలు వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం సాయంగా రూ.1.80 లక్షలు మాత్రమే అందిస్తామని ప్రకటించింది. ఒక్కో లబ్ధిదారుడు రూ.4.70 లక్షలు అదనంగా సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు స్థలాలు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో లబ్ధిదారుల్లో అత్యధికులు స్థలాల్లో గృహాలు నిర్మించుకోలేకపోయారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా గృహాలు నిర్మించుకోలేని లబ్ధిదారుల సంఖ్య 50 వేలకుపైగా ఉంటుందని అంచనా. ఎన్‌టిఆర్ జిల్లాలోనూ అత్యధిక మంది ఇళ్లు నిర్మించుకోలేదు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గృహాలు నిర్మించుకోలేని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

త్వరలో మార్గదర్శకాలు

కాలనీల్లో తమకు కేటాయించిన ప్లాట్లలో 45 వేల మందికిపైగా గృహాలు నిర్మించుకున్నారు. అత్యధిక లబ్ధిదారులు ఇంటి నిర్మాణం భారమవ్వడంతో పునాదులు వేసి వదిలేశారు. మౌలిక వసతులు సమకూరని కాలనీల్లో ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగలేదు. ఇటువంటి పరిస్థితుల్లో అసలు గృహాన్ని ప్రారంభించని ప్లాట్ల పట్టాలు మాత్రమే రద్దు చేస్తుందా? లేక పునాదుల దశలో నిర్మాణాలను నిలిపివేసిన లబ్ధిదారుల ప్లాట్ పట్టాలు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తుందా? అనేది చర్చనీయాంశమైంది. ప్రభుత్వ మార్గదర్శకాలు వెలువడిన వెంటనే జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గృహాలు నిర్మించుకోలేని లబ్ధిదారుల వివరాల నివేదిక సిద్ధం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

మద్యానికి వ్యతిరేకంగా పోరాటం

- ఐద్వా జిల్లా మహాసభ తీర్మానం
- నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కుమారి, సరోజ

ప్రజాశక్తి - విజయవాడ : వంటరి మహిళల హక్కుల కోసం పోరాడాలని, మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఉద్యమించాలని ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా 21వ మహాసభ తీర్మానించింది. నగరంలోని బాలోత్సవ్ భవన్ (సంపర తులశమ్మ, గుళ్లపల్లి జ్యోత్స్న వేదిక)లో జరిగిన ఐద్వా జిల్లా మహాసభ గురువారం ముగిసింది. డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500 ఇవ్వాలని, మైక్రోఫైనాన్స్ ఆగడాలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది. మహాసభలో గాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళల సమాన హక్కుల కోసం పోరాడిన అనేక మంది సంఘ సంస్కర్తలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

23 మందితో నూతన కమిటీ

మహాసభ అనంతరం 23 మందితో నూతన జిల్లా కమిటీ ఏర్పడింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ కుమారి, కె సరోజ, కోశాధికారిగా జి.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 11 మంది ఆఫీస్ బేరర్లను



విజయవాడ ఉత్సవ్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ, అర్బన్ : ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే విజయవాడ ఉత్సవ్‌కు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉత్సవ్‌లో భాగంగా ఎగ్జిబిషన్‌కు గురువారం భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు. విజయవాడ నగరాన్ని కళా, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ఉత్సవాన్ని 11 రోజులపాటు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన స్థలాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం పరిశీలించారు.



విజయవాడ ఉత్సవ్ గొల్లపూడి

(మిగతా 2లో)



మహాధర్నాలో మాట్లాడుతున్న జడ శ్రావణ్‌కుమార్

వార్త మెయిన్‌లో

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే ఉద్యమం

జై భీమ్ రావు భారత్ పార్టీ మహాధర్నాలో నేతల హెచ్చరిక

దుర్గగుడి చైర్మన్‌గా బొర్రా నియామకం



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ప్రభుత్వం నియమించింది. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బొర్రా రాధాకృష్ణ (గాంధీ)ని గురువారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పలు ఆలయాలకు చైర్మన్లను ప్రకటించిన ప్రభుత్వం... దుర్గగుడి చైర్మన్‌గా గాంధీకి అవకాశం ఇచ్చింది. కాగా గాంధీ.. హిందూపూర్ ఎంఎల్‌ఎ బాలకృష్ణకు అత్యంత సన్నిహితులని తెలిసింది.



మహాసభలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

వార్త 8లో

సంక్షేమ బోర్డు సాధనకు ఉద్యమం ఉధృతం

ముఠా వర్కర్స్ యూనియన్ మహాసభలో కె.ఉమామహేశ్వరరావు పిలుపు

చీటింగ్ కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి - విజయవాడ : పటమట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ చీటింగ్ కేసులో నిందితుడైన కష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన మల్లెపూడి గోపిపై నేరం రుజువుకావడంతో విజయవాడ నాలుగో అడిషనల్ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి యు.రామమోహన్ ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పటమట పోలీసు స్టేషన్ పరిధిలో సుస్వదీప్ అగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న గోపీ ఆ కంపెనీకి చెందిన డబ్బులను వాడుకుని మోసం చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

విజయవాడ ఉత్సవ్‌కు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్-పోలో ఎడ్యుకేషన్ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ్ కమిటీ, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. సభ్యులు అనిల్ సుంకర, అరసవిల్లి అరవింద్ తరుపున ఎక్సెల్లా డైరెక్టర్ గొల్లా శేఖర్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు ఎవో ఎస్.కె.పి.వి.వి హైస్కూల్ కమిటీ డాక్టర్ వి.నారాయణ రావు, కె.బి.ఎన్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు గురువారం వెల్లడించారు. ఏ దేశంలో ఎలాంటి కోర్సులు అందిస్తున్నారనే సమాచారం దీని ద్వారా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో ఎడ్యుకేషన్ స్టాల్స్ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల యూకే డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పాల్గొంటారని తెలిపారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖ యూనివర్శిటీలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

బైక్ ర్యాలీ, ప్లాష్ మాబ్స్

విజయవాడ ఉత్సవ్‌తో నగరానికి పూర్వవైభవం తిరిగి రానుందని ఆటోనగర్ ఐలా సంస్థ, ఆటోనగర్ అసోసియేషన్స్ నాయకులు అన్నారు. ఈ ఉత్సవ్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆటోనగర్‌లో ఐలా సంస్థ, ఆటోనగర్ అసోసియేషన్స్ నాయకులు భారీ బైక్ ర్యాలీ, ప్లాష్ మాబ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఆటోనగర్ బస్ టెర్మినల్ దగ్గర గల వంద అడుగుల రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ డిస్ పోజల్ రోడ్డు, టైర్ మార్కెట్ రోడ్డు, పంటకాలవ రోడ్డు, సాయి హెూటల్ సెంటర్ల మీదుగా ఆటోనగర్ మొత్తం సాగింది. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, ఆటోనగర్ ఎలక్ట్రికల్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలామ్ పాల్గొన్నారు.

ఎంపి శివనాథ్‌ను కలిసిన క్రిబ్కో చైర్మన్ సుధాకర్ చౌదరి

విజయవాడ : క్రిషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్ (క్రిబ్కో) నూతన చైర్మన్‌గా ఎంపికైన తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి గురువారం గురునానక్ కాలనీలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమం కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొన్నారు.



లాటరీ ద్వారా ఏడు బార్లు కేటాయింపు

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కాలానికి (ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుండి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు) ప్రకటించిన కొత్త బార్ పాలసీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో సాధారణ కేటగిరీ విభాగంలో 130 బార్లు, గీతకులాల వారికి ప్రత్యేకంగా 10 బార్లు కేటాయించారు. తొలి విడత నోటిఫికేషన్లో భాగంగా ఓపెన్ కేటగిరీలో 69 బార్లు, గీత కులాలవారికి కేటాయించిన 10 బార్లు మొత్తం 79 బార్ల కేటాయించారు. జిల్లాలో ఓపెన్ కేటగిరీలో మిగిలిపోయిన 61 బార్ల కేటాయింపునకు ఈనెల 3న మళ్లీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 17వ తేదీతో గడువు ముగిసే సమయానికి ఓపెన్ కేటగిరీలో ప్రకటించిన 61 బార్లకుగాను ఏడు బార్లకు మాత్రమే మొత్తం 28 దరఖాస్తులు వచ్చాయి. 54 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. వీటిలో నిబంధనల ప్రకారం కనీసం 4 దరఖాస్తులు వచ్చిన 7 బార్ల కేటాయింపు ప్రక్రియ... ముందే ప్రకటించిన విధంగా గురువారం ఉదయం 8 నుంచి విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, దరఖాస్తుదారుల సమక్షంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ లాటరీ విధానంలో బార్లు కేటాయించారు. రెండో విడత నోటిఫికేషన్ ద్వారా బార్ల కేటాయింపు పూర్తయిన తరువాత ఇంకా 54 బార్లు దరఖాస్తులు రాని కారణంగా ఆగిపోయాయి. తిరువూరు నగర పంచాయతీ పరిధిలో ఒకటి, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు, విజయవాడ నగర పరిధిలోని 46 బార్లు మిగిలిపోయిన వాటిలో ఉన్నాయి. బార్లు దక్కించుకున్న దరఖాస్తుదారులు సాంవత్సరిక లైసెన్సు ఫీజులో 6వ వంతు సొమ్మును వెంటనే ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



మచిలీపట్నంలో...

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: చాలీచాలని జీతాలు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మున్సిపల్ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పెరుగుతున్న నిత్యావసర ధరలకనుగుణంగా, 12వ పిఆర్సి ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రతినెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె తదితర రక్షణ పరికరాలను వెంటనే కార్మికులను అందజేయాలన్నారు. పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవుల బిల్లులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చుక్కాకుల బుల్లెమ్మ, మచిలీపట్నం సిఐటియు కన్వీనర్ చిరువోలు జయరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మచిలీపట్నం కార్యదర్శి దుర్గాప్రసన్నుడు, స్వప్న, దుర్గ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** మున్సిపల్ కార్మికులకు పిఆర్సి ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాడిగడప మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు షేక్ ఖాసిమ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సరళ, రెడ్డి, రత్న కరుణ కార్మికులు పాల్గొన్నారు.



తాడిగడపలో...

కూచిపూడి అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కూచిపూడి గ్రామాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో డిఆర్ఓ కే చంద్రశేఖరరావుతో కలిసి కూచిపూడి గ్రామ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామీణ స్వచ్ఛ అభయాన్ కింద కూచిపూడిలోని ఆయా అభివద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని, ప్రతిపాదించిన పనులకు అంచనాలు తయారు చేసి సమర్పించాలన్నారు. పామర్రు నుంచి కూచిపూడి, అదేవిధంగా కళాక్షేత్రం యూనివర్సిటీకి చేరుకునే ఐలూరు రహదారుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని డ్రైనేజీ మరమ్మతులను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ కెపాసిటీ బిల్డింగ్ ఏడి లజవంతి నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.రామలక్ష్మణరావు, కన్సల్టెంట్ సాహితి, డిఆర్డిఎ పిడి హరిహరనాథ్, మొవ్వ ఎంపీడీవో డి సుహాసిని, తహసీల్దారు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



వరి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: వరి సాగులో రైతులకు నష్టం కలిగించే ఎలుకల నివారణకు రైతులందరూ సామూహికంగా కలిసి ఎదుర్కోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి అన్నారు. మండలంలోని పొణుకుమాడు గ్రామంలో గురువారం ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ రైతులు అందరూ కలిసి సమిష్టిగా ఎలుకల నిర్మూలన చేయాలని, దానికి ప్రభుత్వం వ్యవసాయ వంద శాతం సబ్సిడీతో 'బ్రయోడయోలోన్' మందులను అందిస్తుందన్నారు. పొణుకుమాడు పిఎసి ఎస్ చైర్మన్ సుంకర రాజేష్ మాట్లాడుతూ రైతులకు ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రమేష్, ఏపీవో నాగేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.



దీక్షలకు ఎస్ఎఫ్ఐ సంఘీభావం

ప్రజాశక్తి-ఉంగుటూరు: అసైన్మెంట్ భూ బాధితుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సమరం అన్నారు. మండలంలోని ఎలుకపాడు అసైన్మెంట్ భూములను ఆన్లైన్ చేయాలని జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం పదో రోజు కొనసాగింది. సమరం దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా ఇచ్చిన భూములను ఆన్లైన్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, బాధితులు పి సుగుణ రావు, ఎం కోటేసు, ఎం విశ్వేశ్వరరావు, కే శిఖామణి, వై మేరీ గ్రేసు, ఎం మరియమ్మ, సిహెచ్ సుబ్బమ్మ, ఏ సుగుణ, పి కమల పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సిబ్బంది గొడుగుపేట విద్యుత్ ఏడిఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐకాస చైర్మన్ బొర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగులు, పెన్షన్‌దారులకు నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకాల్లో పాత పద్ధతిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకాస కన్వీనర్ వి అంకబాబు, నాయకులు పి డేవిడ్, మోహన్‌రావు, రాజు పాల్గొన్నారు.



రెండు మండలాలను విజయవాడలో కలపాలి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: తాగునీరు, చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వానికి కోరారు. గురువారం ప్రారంభమైన రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో యార్లగడ్డ పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రకాశం బ్యారేజీకి కూతవేటు దూరంలో ఉన్న గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలంలో ఉన్న తొమ్మిది గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా చెత్త సమస్య రోజురోజుకీ తీవ్ర రూపం దాలుస్తుందని, దీని పరిష్కారం కోసం విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను, గన్నవరం మండలాన్ని విజయవాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు.

22 నుంచి వేమవరంలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా నవరాత్రుల వేడుకలను ఈ నెల 22 నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని దేవస్థాన చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహనరావు(మోహన్) తెలిపారు. గురువారం దేవస్థాన మీటింట్ హాల్‌లో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్లేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మీ పావని పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


గన్నవరంలో...

ప్రజాశక్తి-గన్నవరం: గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్ఏలకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని గన్నవరం రెవెన్యూ కార్యాలయం ఎదుట వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలన్నారు. వీఆర్ఏలను నైట్ వాచ్మెన్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా వినియోగిస్తూ పని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి అనూష తదితరులు పాల్గొన్నారు. **పామర్రు:** వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి ఈ నెల 23న విజయవాడలో జరగనున్న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని స్థానిక తాసిల్దార్ రవికాంత్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల అధ్యక్షులు జే.బాబుజి, కార్యవర్గ సభ్యులు దాసరి ప్రసాద్, చాట్లా రమేష్, ప్రభాకర్, గోపి తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** గ్రామ రెవెన్యూ సహాయకులు అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి వెంకటేశ్వరరావు, మునేశ్వరరావు, సంపూర్ణరావు, ముసలయ్య పాల్గొన్నారు.



అవనిగడ్డలో...

ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ ధర్నా

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: గాజా పట్టణాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించడాన్ని ప్రపంచ దేశాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పాలస్తీనాకు సంఘీభావంగా ప్రపంచ దేశాలు గొంతు కలపాలన్నారు. గురువారం మచిలీపట్నం కోనేరు సెంటర్లో ఇజ్రాయిల్ ఆక్రమణలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పాలస్తీనాలో ప్రజలు ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఆహారం, పాలు, నిత్యవసర సరుకులు దొరక్క అల్లాడుతున్నారని, ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని శాంతి స్థాపనకు పూనుకోవాలన్నారు. ప్రజలు జీవించే హక్కును అగ్రరాజ్యం అండతో ఇజ్రాయిల్ హరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పాలస్తీనాకు మద్దతు తెలపకపోగా ఇజ్రాయిల్‌తో వ్యాపార సంబంధాలు కొనసాగించడానికి ప్రయత్నించడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సంఘం నాయకులు కొడాలి శర్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూర సుబ్రమణ్యం, సీనియర్ నాయకులు ఎస్ ధనుంజయరావు, వికలాంగుల జాతీయ వేదిక నాయకులు నారాయణ, సిఐటియు మచిలీపట్నం మండల కన్వీనర్ చిరువోలు జయరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టి చంద్రపాల్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్లపల్లి వేణుగోపాలరావు పాల్గొన్నారు.



బాబోయ్ కోతులు... జనం పరుగులు

ప్రజాశక్తి-పామర్రు: గ్రామాల్లో కోతులు బెడద తీవ్ర సమస్యగా మారుతోంది. ముఖ్యంగా వ్యవసాయం ఉన్న గ్రామాల్లో పంటలకు నష్టం కలుగుతుంది. పిల్లలు, పెద్దలు భయాందోళనతో పరుగులు పెడుతున్నారు. పెదమద్దాలి గ్రామంలో కోతులు బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్య దాటి వందల్లోకి చేరాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ జామ, బొప్పాయి వంటి పండ్ల చెట్లను, కొబ్బరి చెట్ల కాయలను, బీర, పొట్ల వంటి కూరగాయ మొక్కలను నాశనం చేస్తున్నాయి. ఒక్కోసారి ఇళ్లలోకి చొరబడి ఇంట్లోని వస్తువులను తీసుకెళ్లిపోతున్నాయి. ఆరు బయట కూర్చుని తినే వారిపై దాడి చేస్తున్నాయి. చిన్నపిల్లలు ఆడుకోవటానికి కూడా బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కోతుల సమస్యను స్థానిక పంచాయతీ దృష్టికి అనేకమార్లు తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని గ్రామస్తులంటున్నారు. పంచాయతీ సిబ్బంది అరకొరగా కొద్ది రోజులు టపాసులు పేల్చి చేతులు దులుపుకున్నారు.

చికిత్స చేయించుకున్నా : సుందర్రావు, వ్యవసాయ కూలీ




మా ఇంటి డాబా పైకి వెళ్లి వస్తుంటే కోతులు ఒక్కసారిగా వెనుక నుండి మీద పడ్డాయి. ప్రాణభయంతో డాబాపై నుండి కిందకు దూకేశాను. కోతులు చేసిన గాయానికి తగిలిన దెబ్బలకి పామర్రు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నాను.

దాడి చేశాయి : జి.మోహన్‌రావు, వ్యవసాయ కూలీ



కోతులు అక్కడున్న చిన్నపిల్లల మీదకు రాబోతుంటే అడ్డగించాను. ఒక్కసారిగా నా మీద పడి కాలు పిక్కను తీవ్రంగా గాయం చేశాయి. చాలామంది మహిళల మీద కూడా దాడికి పాల్పడ్డాయి.



సమస్య తీవ్రంగా ఉంది : ఎం.శివకృష్ణ, సామాజిక కార్యకర్త



గ్రామంలో కోతులు బెడద తీవ్రంగా ఉంది. స్థానిక పంచాయతీ దృష్టికి అనేకమార్లు తీసుకువెళ్లా. మనుషుల మీద దాడి చేయడమే కాకుండా చెరువు గట్టుమీద మేకలు వేస్తుంటే వాటి పిల్లను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా
శుక్రవారం
19 సెప్టెంబర్ 2025













సాంస్కృతిక సంబరం

ప్రజాశక్తి–ఎడ్యుకేషన్: దసరా పండుగ సందర్భంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంపొందించడానికి వివిధ అభ్యుదయ సంఘాలు, సంస్థల ఆధ్వర్యాన దసరా సాంస్కృతికోత్సవాలు విజయవాడలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంబివికె, సేఫ్, తరుణీతరంగాలు, భారత మహిళా మండలి, జన శిక్షణా సంస్థాన్, ఫోరం ఫర్ ఆర్టిస్టు, స్పహాప్తి ఆర్గనైజేషన్, ఇన్నర్ వీల్ (మిడ్టెన్), సన్ షైన్, వన్ ఎర్త్ వన్ లైఫ్, నిర్భయ మహిళా మండలి తదితర అభ్యుదయ మహిళా సంస్థలు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. 'హింసారహిత సమాజం – పర్యావరణ పరిరక్షణ' అనే థీమ్‌పై విభిన్న అంశాలకు సంబంధించి విద్యార్థులు, యువతీయువకులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. థీమ్‌కు అనుగుణంగా మహిళా సమస్యలు, వివక్ష, సమానత్వం, హింస, అక్రమ రవాణా, ఫోర్నోగ్రఫీ, సామాజిక సమస్యలు, మాదక ద్రవ్యాలు, పర్యావరణం, మత సామరస్యం తదితర అంశాలతో కళారూపాలు ప్రదర్శించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, కోలాట దళాలు తమ కళా రూపాలను ప్రదర్శించారు.

సందేశాత్మకంగా వీధి నాటికలు

హింసా రహిత సమాజం–పర్యావరణ పరిరక్షణ థీమ్ తో మహిళల సమస్యలు – వివక్షత సమానత్వం, హింస, అక్రమ రవాణా, సాంఘిక సమస్యలు, మాదక ద్రవ్యాలు, శాస్త్రీయ దృక్పథం, మత సామరస్యం, వంటి అంశాలపై వీధి నాటికలు నిర్వహించారు. ఈ విభాగంలో నగరంలోని వివిధ కళాశాలల నుండి 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరు ప్రధానంగా డ్రగ్స్, మత సామరస్యం అనే అంశాలపై వీధి నాటికలు విద్యార్థులు చక్కగా చేశారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని విద్యార్థులు చక్కగా నాటిక రూపంలో ప్రదర్శించారు. 40 కోలాట దళాల నుండి సుమారు 250 మంది మహిళలు, విద్యార్థులు కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. గుజరాతీ సంఘం నుండి దాండియా ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. వీరితో పాటు ఎంబివికె బృందం ప్రత్యేకంగా ప్రదర్శించిన దాండియా నృత్యం అలరించింది.

తొలిరోజు విజేతలు

ఫ్లాష్ మాబ్ : ప్రథమ బహుమతి పీవీపీ ఇంజనీరింగ్ కాలేజ్, ద్వితీయ బహుమతి కేబీఎన్ కాలేజీ, తీతీయ బహుమతి ఆంజనేయ ఇంజనీరింగ్ కాలేజ్ సాధించాయి.

వీధి నాటిక : ప్రథమ బహుమతి నలంద కాలేజ్, ద్వితీయ బహుమతి వైవి రావు సిద్ధార్థ కాలేజ్, తృతీయ బహుమతి ఆంధ్రా లయోలా కాలేజ్ సాధించాయి.

కోలాటం సీనియర్స్: ప్రథమ బహుమతి ఏజిఎస్‌జి సిద్ధార్థ డిగ్రీ కాలేజ్, ద్వితీయ బహుమతి నలంద డిగ్రీ కాలేజ్, తృతీయ బహుమతి కెబీఎన్ కాలేజ్ సాధించాయి.

















మాట్లాడుతున్న ప్రముఖ రచయిత్రి సత్యవతి





హింసా రహిత సమాజం పర్యావరణ పరిరక్షణ థీమ్‌తో జరుగుతున్న దసరా సాంస్కృతికోత్సవాలు ఉత్సాహభరితంగాను...ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. ప్రధానంగా కళాశాల యువత పెద్ద సంఖ్యలో వివిధ అంశాలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి పలువురు విద్యార్థులను పలుకరించగా ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎక్కడా లేవని మాకు చాలా ఆనందంగా ఉందని పలువురు చెపుతున్నారు.

మా ప్రతిభ తెలుస్తుంది : స్నేహ



ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన మా ప్రతిభ తెలుస్తుంది. చాలా మంచి కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడే అంశంపై పెడుతున్నారు. నాకు నచ్చింది. మాకు మంచి ప్రదర్శన ఇచ్చామని తృప్తి ఉంది. ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం జరగాలి.

పండుగ ముందుగానే వచ్చింది : జీవన శ్రీ




దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు బాగున్నాయి. చాలామంది వచ్చారు.ఇక్కడ సందడి వాతావరణం చూస్తే దసరా ముందుగానే వచ్చిందని అనిపిస్తుంది. నేను మొదటిసారి పాల్గొన్న మంచి కార్యక్రమాలు పెట్టారు.

మన సంస్కృతి తెలుస్తుంది : సాయి సిరి



ఇప్పటివరకు కల్చరల్ కార్యక్రమాలు అంటే సినిమా పాటలు, ఉండేవి. కానీ దసరా సాంస్కృతికోత్సవాలు పేరుతో నిర్వహిస్తున్న పోటీలు మన సంస్కృతికి , సంప్రదాయానికి అద్దం పట్టే విధంగా నిర్వహిస్తున్నారు. మన చరిత్ర, ,మన సంస్కృతి నాతో పాటు ఇతరులకు కూడా తెలియచేస్తున్నారు.

అన్ని చోట్లా జరగాలి : పల్లవి



దసరా ఉత్సవాలు పేరుతో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఒక్క చోటనే కాకుండా అన్ని చోట్లా జరగాలి. దీని వలన మన సంస్కృతి నేటి తరం అందరికీ తెలుస్తుంది. అలాగే విద్యార్థులలో సజనాత్మకత కూడా పెరుగుతుంది.







సాంస్కృతికోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు











పవర్ లిఫ్టింగ్‌లో ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-మైలవరం : ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో స్థానిక ఎల్‌బిఆర్‌సిఇ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు తిరువూరులో జరిగాయని, ఈ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు కేకే సిద్ధార్థ 66 కేజీల విభాగంలో 410 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం, 77 కేజీల విభాగంలో టీ గోపీచంద్ 47 కేజీలు బరువెత్తి కాంస్య పథకం, 93 కేజీల విభాగంలో ఎం కార్తీక్ 340 కేజీల బరువు నెత్తి కాంస్యం, 120 కేజీల విభాగంలో నిఖిల్ సాయి 350 కేజీల బరువు నెత్తి రజితం, 120 కేజీల విభాగంలో డి రామ్ కుమార్ 405 కేజీల బరువు నెత్తి బంగారు పతకం సాధించారని తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను, ట్రైనీ జిమ్ కోచ్ నటరాజన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి రాజ్ కుమార్‌లను కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, అభినందించారు.

దివీస్ ల్యాబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిగాంచిన దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్‌లో ఉపాధి అవకాశాల కోసం గురువారం పట్టణంలోని జేఆర్సి -విశ్వభారతి డిగ్రీ కాలేజీలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 60 మంది కెమిస్ట్రీ గ్రాడ్యుయేట్లు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జెఆర్సీ కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు ప్రారంభించారు. ఈ ఇంటర్వ్యూలు స్థానికంగా ఉద్యోగావకాశాలే కాకుండా, రాష్ట్రంలోని ప్రతిభావంతులైన యువతకు దేశ, అంతర్జాతీయ స్థాయి కెరీర్‌కి దారితీసే వేదికగా నిలిచాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెఆర్సీ సెక్రటరీ, కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్, కళాశాల ప్రిన్సిపాల్స్ కె ఎన్ రమేష్, జూటూరు వెంకటేశ్వర్లు (అబ్బులు), ప్రతినిధులుగా జల్లా తిరుపతి రావు, వివిఎల్ నారాయణరావు, డివీస్ ల్యాబొరేటరీస్ తరఫున హెచ్‌ఆర్ ప్రతినిధులు రామకష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : న్యాయవాదుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ గురువారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ అన్యాయ పూరిత సర్క్యులర్‌ను హైకోర్టు తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఆరెపల్లి వెంకటేశ్వర్లు, గోనెల వెంకటేశ్వర్లు, ఎం ఆంజనేయులు, కె శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, గంటా కష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శేషగిరిరావుకి సన్మానం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట : రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డెవలంమెంట్ డైరెక్టర్‌గా నియమితులైన కర్రీ శేషగిరి రావుకి సన్మాన కార్యక్రమం గురువారం జగ్గయ్యపేటలో జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తూమటి కృష్ణమాచారి, ఉల్లి రామకృష్ణ చారి, పిన్నెల్లి జ్వాలా నరసింహ, సయ్యద్ మస్తాన్, మామిళ్ళపల్లి వెంకటరమణాచారి, అమలాపురపు వాసు, సుంకర సతీష్, ఆలూరి శశి, నాని, శిరసనగండ్ల విజయకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి వికాస్‌లో అంతర్జాతీయ సదస్సు



ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : రూరల్ మండలం నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (వీజీటీఎన్)లో ఈనెల 19, 20 తేదీల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ అండ్ లైఫ్ సైన్సెస్‌లో తొలి అంతర్జాతీయ సదస్సు (ఐసీఈటీఈపీఎల్ఎస్ – 2025)ను నిర్వహిస్తోంది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర రాష్ట్రాలతోపాటు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వికాస్ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయనరెడ్డి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ తొలి అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విట్ – ఏపీ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ విఠల్ రావు, నిట్–వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ అంబా ప్రసాద్ ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగానూ, అమెరికాకు చెందిన విద్యార్థులు, అధ్యాపకుల నుండి 328 పరిశోధనా పత్రాలు వచ్చాయని, వాటిలో 112 అత్యుత్తమ నాణ్యత గల పత్రాలు ప్రదర్శన కోసం షార్ట్‌లిస్ట్ చేశామని చెప్పారు. తొలి ఐసీఈటీఈపీఎల్ఎస్ – 2025 పరిశోధన, అభివృద్ధి, విద్యా ఆవిష్కరణ, అంతర్–విభాగ సహకారంపై పెరుగుతున్న ప్రాధాన్యతను సదస్సు ప్రతిబింబిస్తుందని చెప్పారు. సదస్సులో సమర్పించిన అన్ని పత్రాలను స్కోపస్, బెంథమ్ సైన్స్, వెబ్ ఆఫ్ సైన్స్‌లలో ప్రచురించి ఇండెక్స్ చేస్తామని, సహకారులకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. జ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడానికి, పరివర్తనాత్మక ఆలోచనలను చర్చించడానికి, స్థిరమైన అభివద్ధి, సామాజిక పురోగతికి దోహదపడటానికి సదస్సు ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. సదస్సులో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, వ్యవసాయం, ప్రాథమిక శాస్త్రాలు, ఫార్మసీ, ఎలక్ట్రికల్ నిర్వహణతో సహా విభిన్న డొమైన్‌లు కవరవుతాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐసీఈటీఈపీఎల్ఎస్ – 2025కు వీజీటీఎన్ పరీక్షల నియంత్రణాధికారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ఎన్ ఫణి పొన్నపల్లి, సహ–కన్వీనర్లు టీ కిషోర్ రెడ్డి, జీ శేఖర్ రెడ్డి, టెక్నికల్ ప్రోగ్రామ్ కమిటీ సభ్యుడు, ఐక్యూఏసీ డీన్ డాక్టర్ సీహెచ్ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-వత్సవాయి : ఐసిడిఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు పరిధిలో ఉన్న పెనుగంచిప్రోలు గ్రామంలో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా రెండో రోజు పిల్లల బరువులు తీస్తూ ఊబకాయం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఆయిల్, చక్కర తగ్గించుకొని వాడాలని తల్లులకు, గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు

తెలంగాణ మంత్రి సీతక్కను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-విస్సన్నపేట : విస్సన్నపేట మండలం కొర్లమండ గ్రామంలో తెలంగాణ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా స్థానిక టిడిపి నాయకులు గురువారం కలిశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విసన్నపేట మండల అధ్యక్షులు రాయల సుబ్బారావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు ఎన్నారై వల్లభనేని గిరి బాబు రాష్ట్ర తెలుగు యువత కవుల రాజా తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టాలి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 49వ డివిజన్ టైలర్ పేట కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు తెలిపారు. గురువారం నాడు కొండ ప్రాంతంలో సిపిఎం బృందంతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో సత్య బాబుకు స్థానిక ప్రజలు వాటర్ పైప్‌లైన్ పగిలి మంచినీరు వధాగా పోతున్న క్రమంలో తాగు నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా మెట్ల మార్గాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు వెంటనే మార్పు చేయాలని కోరారు. పాడైన కాలవలో మెట్లు బాగు చేయాలని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కొండ ప్రాంతం ప్రజలు ఐక్యంగా పోరాటాలకి ముందుకు రావాలని సత్తిబాబు కొండ ప్రాంత ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జి.బాల దుర్గారావు, ఎన్ చిన్నగురప్ప. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



ప్రజాశక్తి- నందిగామ: ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నందిగామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ నందిగామ పట్టణంలో పెరిగిన నివాస ప్రాంతాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ప్రభుత్వం బ్యాంక్ అకౌంట్‌లు మారుస్తుందని.. సంతకంతో పని లేకుండా కార్మికులందరికీ అకౌంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 18న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో ధర్నాలు, 23న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దాసరి సైదా, సలికేటినరేష్, పూట్టా మాణిక్యం, రాజరత్నం, బేబీ, రుత్తుమ్మ, నాగరాజు, సంతీష్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాట ఫలితం

- మైలవరం-నూజివీడు రోడ్డుకు శంకుస్థాపన



అభినందనలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి-మైలవరం : సిపిఎం పోరాటం ఫలించింది. అధికారులు స్పందించి మైలవరం – నూజివీడు ప్రధాన రహదారి నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. వివరాల్లోకెళ్తే మైలవరం నుండి నూజివీడు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. పేరంటాలమ్మ గుడి నుండి నూజివీడు వరకు రహదారి దాదాపు సంవత్సర కాలం నుండి మరమత్తులకు నోచుకోకపోవడంతో గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో వెల్వడం, చంద్రాల, గణపవరం గ్రామస్తులు సిపిఎం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. చివరకు ఆర్అండ్‌బి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడంతో అధికారులు స్పందించారు. సిపిఎం మండల కార్యదర్శి సుధాకర్, రావుల సుబ్బారావు తదితరులు ఆర్అండ్‌బి అధికారులను కలిసి మాట్లాడారు. రహదారి పునర్నిర్మాణానికి ఆరు కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచామని, ఇటీవల టెండర్లు ప్రక్రియ పూర్తవుతోందని కాంట్రాక్టర్ దసరా అనంతరం రహదారి పనులు ప్రారంభిస్తారని ఈ సందర్భంగా ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు. గురువారం పేరంటాలమ్మ గుడి వద్ద కూటమి నాయకులు శంకుస్థాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సిపిఎం పోరాటం వల్లే రహదారికి మోక్షం కలిగిందని ఫ్లెక్సీలు, బ్యానర్లను వెల్వడం ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసి గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు.

సహచర ఉద్యోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరువూరు : తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తోటి ఉద్యోగికి 108 కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. విజయవాడ భవానీపురం లోకేషన్‌లో 108 వాహన డ్రైవర్ (పైలట్)గా విధులు నిర్వహిస్తున్న పటాన్ రషీద్ ఖాన్ గత కొన్ని నెలలుగా తీవ్రమైన అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రషీద్ ఖాన్ వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడటంతో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు రూ.34,200 ఆర్థిక సహాయం అందజేసి రషీద్‌కు మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాఘవులు, మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు సీతారామయ్య, పైలట్ నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ల అభివృద్ధికి కృషి : నెట్టెం

ప్రజాశక్తి-వత్సవాయి : ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం కషి చేస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు జిల్లా చైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. వత్సవాయి మండలంలోని పోలంపల్లి గ్రామంలో పిఎసిఎస్ అధ్యక్షులు మన్నె బాలకృష్ణ నిర్వహించిన అభినందన సభలో నెట్టెం శ్రీ రఘురాం, శ్రీరాం రాజగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత జగ్గయ్యపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అనంతరం అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, దాబాకుపల్లి పెంట్యాల శ్రీనివాసరావు, కిలారి సూర్యనారాయణ, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో గురువారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుస్సా సురేష్, మెడికల్ క్యాంపు కన్వీనర్ కట్టా వెంకట నరసింహారావు, ఎన్ శివరాం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల: గర్భిణీలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని కృష్ణాపురం సెక్టర్ సూపర్వైజర్ సలీ మున్నిస అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాపురం అంగన్వాడి సెంటర్లో పోషకాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు.

రక్తదాన మహోత్సవం

ప్రజాశక్తి-ఉంగుటూరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఉషా రామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్స్ పాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. పొట్టిపాడు ఉషా రామ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం విజయవాడ అమెరికన్ బ్లడ్ క్యాన్సర్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ రక్తదాన వహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొత్తం 106 మంది విద్యార్థులు రక్తదానం చేశారు, ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరి బాబు, వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

'విజయ నర్తనం కొండపల్లి' పేరుతో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: విజయవాడ కేంద్రంగా విజయవాడ ఉత్సవం పేరుతో జరుగుతున్న దసరా ఉత్సవాల స్ఫూర్తితో కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పవిత్ర సంగమం విజయ నర్తనం కొండపల్లి పేరుతో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు తెలిపారు. గురువారం కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రోత్సహించాలని పేరుతో ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు.

మట్టి వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని తక్కెళ్లపాడు, రామచచంద్రునిపేట శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి, టిప్పర్, 2 ట్రాక్టర్లను చిల్లకల్లు పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా తెలంగాణాకు మట్టి, ఇసుక, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తే చర్యలు ఉంటాయని ఎస్ఐ సూర్య శ్రీనివాస్ తెలిపారు.

పోర్టులో పచ్చదనం పెంపునకు చర్యలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం పోర్టు ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో ఏపీ మారిటైం బోర్డు, మెగా సంస్థ, రైట్స్, మున్సిపల్, అటవీ శాఖ అధికారులతో మచిలీపట్నం పోర్టు గ్రీన్ యాక్షన్ ప్లాన్ కు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు ప్రాంతంలోని 266 ఎకరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారిణి సునీత, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఏపీ మారిటైంబోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పల్లారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

ఈవీఎం గోదాము తనిఖీ

కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదామును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం సాయంత్రం డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ స్టేట్ ఈవీఎం నోడల్ అధికారి ఎస్ ఆంజనేయులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరచిన గోదాము, వాటి సీళ్లు, సెక్యూరిటీ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి రిజిస్టర్లో సంతకం చేశారు.



లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ : మున్సిపల్ సిబ్బంది రూపొందించిన పురపాలక సంఘ లోగోను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. గురువారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మున్సిపల్ అధికారులతో కలిసి పురపాలక సంఘ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నందివాడ: నందివాడ పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం మెరుపు దాడి చేశారు. రుద్రపాక గ్రామ శివారు గాజులపాడు గ్రామంలో చెరువు గట్టుపై పేకాట ఆడుతుండగా సమాచారం అందడంతో పోలీసులు తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి, రూ.1.40 వేలు నగదు, 3 కార్లు , 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పామర్రు: నేటి సమాజంలో సెల్ఫోన్ ప్రభావం ఎక్కువగా ఉందని విద్యార్థులు అవసరమైన అంత మేరకు అవగాహన కలిగి మాత్రమే దానిని వినియోగించుకొని తగుదూరంగా ఉంచాలని పామర్రు సీఐ.సుభాకర్ అన్నారు.స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీలకు సోషల్ మీడియా,సైబర్ మోసాలు,పోక్సో చట్టం,ఎండిపిఎస్ చట్టం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి: ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుండి అక్టోబర్ రెండవ తేదీవరకు స్వస్ట్ నారి సశక్తే పరివార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ కర్త డాక్టర్ ఏవి శేష కుమార్ అన్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ బిఎస్ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెండవ రోజు గురువారం చల్లపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలపై తగు సూచన చేశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.



పాత ఎడ్లలంక సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: తరచూ కృష్ణా నదికి వస్తున్న వరదల కారణంగా పాత ఎడ్లలంక గ్రామ కోత నివారణకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్నారై బోబ్బా గోవర్ధన్ నేతృత్వంలో టిడిపి ప్రతినిధి బృందం తాసిల్దార్ కె నాగమల్లేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం తాసిల్దారును కలిసిన గోవర్ధన్ మాట్లాడుతూ నది కోత కారణంగా ఎడ్ల లంక గ్రామ ప్రజల ఉనికి ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. వసతి, ఉపాధి దివి మనుగడపై ఆధారపడి ఉందన్నారు. గ్రామం కోతకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజలకు భరోసా కల్పిస్తే గ్రామం వదిలి ఎవరూ వెళ్లరన్నారు. దీనిపై తాసిల్దార్ స్పందిస్తూ శనివారం గ్రామసభ నిర్వహిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పీత వెంకటేశ్వరరావు, కొల్లూరి వాసు, పాలెపు దుర్గారావు, టిడిపి నేతలు బండే శ్రీనివాసరావు, కర్ర సుధాకర్, పర్చూరి దుర్గాప్రసాద్, మేడికొండ విజయ్, బచ్చు హనుమాన్, అడపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. స్క్రీన్ ద్వారా పిల్లలకు అర్థమయ్యేలా వివరాలు తెలియజేశారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు జోలికి వెళ్లి జీవితాన్ని పాడుచేసుకోవద్దు అని, మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోర్డినేటర్ ఎస్.కె నజ్మా, జోనల్ కోఆర్డినేటర్ డి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించాలి



ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణ పరిధిలోని ఆటోనగర్ ప్రాంతంలోని కెమికల్ ప్లాంట్స్ ఫార్మా కంపెనీలు, తదితర కర్మాగారాల నుండి వెలువడే కాలుష్యాన్ని నివారించాలని పట్టణానికి చెందిన ధరణికోట వెంకటరమణ, మందడపు శ్రీనివాసులు, గద్దె నాని తెలిపారు. ఈ మేరకు జగ్గయ్యపేటలో కేడీసీసీ బ్యాంక్ ప్రస్తుత చైర్మన్ నెట్టెం రఘురాంను గురువారం వారు కలిసి వినతి పత్రం అందజేశారు. జగ్గయ్యపేటలోని ఆటోనగర్ చుట్టూ 5 కిలో మీటర్ల పరిధిలో ఉన్న షేర్ మహమ్మద్ పేట, తొర్రగుంటపాలెం, జగ్గయ్యపేట శాంతినగర్ మొదలు అనేక ప్రాంతాలు కాలుష్యమైపోయాయని, నీరు, గాలి కాలుష్యమైపోతుందని, ఇప్పటికే జగ్గయ్యపేట ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, ఆటోనగర్‌లోని కార్మికులు అనారోగ్యంపాలయ్యారని తెలిపారు. జగ్గయ్యపేటలో కాలుష్యాన్ని నివారించాలని కోరారు. దీనిపై నెట్టెం రఘురాం స్పందించి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పొల్యూషన్ బోర్డ్ చైర్మన్, ఆర్డీఓకు ఫోన్ చేసి వారం రోజుల్లో నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులుగా గంగాధర్



ప్రజాశక్తి - తిరువూరు : జన విజ్ఞాన వేదిక (జెవివి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి ఎం.రాం ప్రదీప్ రాష్ట్ర కమిటీ ఆహ్వానితునిగా నియమితులయ్యారు. ఈ ఇరువురు రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గంగాధర్, రామ్ ప్రదీప్‌లను జనవిజ్ఞానవేదిక నాయకులు ఎం.హరికృష్ణ, కె.పాపారావు, పి. శీనయ్య, ఎం.సుధాకర్, పి.సోమయ్య, డి.సుద ర్శన్, తదితరులు అభినందనలు తెలిపారు.

సొంతింటి కలను సాకారం చేసుకోండి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మునిసిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు గురువారం మునిసిపాలిటీ కార్యాలయంలో అంగీకార్ 2.0 (ప్రధానమంత్రి ఆవాస యోజన) హౌసింగ్ పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ పి ఎంఏవై అర్బన్ హౌసింగ్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రతి ఇంటి నిర్మాణానికి రెండున్నర లక్షల రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో మంజూరు చేస్తున్నారని, సొంత స్థలం కలిగి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ. 2.17 కోట్లు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై గత 14 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మల్లికార్జున మహా మండపం ఆరోవ అంతస్తులో జరిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో రూ.2,17,98,528 నగదు, 235 గ్రాములు బంగారం, 3.9 కేజీల వెండి లభించింది. పలు దేశాల విదేశీ కరెన్సీ ద్వారా 321 యూస్ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 25 యూఏఈ దిర్హామ్స్, 25 సౌదీ రియల్స్, 200 ఒమన్ బైసా కరెన్సీతో పాటు 7 ఇతర దేశాల కరెన్సీ 48 హుండీలలో కానుకలుగా వచ్చాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ వెల్లడించారు.



టిడిపి కంచికచర్ల నూతన అధ్యక్షుడిగా కిషోర్

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల పట్టణ టిడిపి అధ్యక్షుడిగా ఎన్నికైన వేమా కిషోర్, ఉపాధ్యక్షులు మలినేని శ్రీనివాసరావులను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందించారు. ఇటీవల వేమా కిషోర్ కంచికచర్ల పట్టణ టిడిపి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను వేమా కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడుగా ఎన్నికైన వేమా కిషోర్, ఉపాధ్యక్షుడు మలినేని శ్రీనివాసరావులను సౌమ్య శాలువాలతో సత్కరించారు. పార్టీ బలోపేతం చేయడానికి మరింతగా కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కె యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, గుత్తా ఓంకార్, బాణావత్ సైదులు, పుల్లగూర బాబు, తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ బోర్డు సాధనకు ఉద్యమం ఉధృతం

- ముఠా వర్కర్స్ యూనియన్ మహాసభలో నేతల పిలుపు

ప్రజాశక్తి-విజయవాడ

వెల్ఫేర్ బోర్డు సాధనతోపాటు పని కల్పన కోసం మరింత ఐక్యతతో ఉద్యమాలను ముఠా వర్కర్స్ ఉధృతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. విజయవాడ ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 36వ మహాసభ పి.ఎరకయ్య ప్రాంగణం (ఎంబి భవన్)లో గురువారం జరిగింది. ముందుగా యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షులు ఎం.బ్రహ్మయ్య ఆవిష్కరించారు. సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి ఇవి నారాయణ సంతాపం తీర్మానం ప్రవేశపెట్టారు. కార్మికోద్యమ నేత, సిపిఎం పూర్వ అఖిలభారత కార్యదర్శి సీతారామ్ ఏచూరి, కేరళ మాజీ సిఎం విఎస్ అచ్యుతానందన్, సిఐటియు కేంద్ర, రాష్ట్ర, స్థానిక నాయకులకు మహాసభ సంతాపం తెలిపింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం సీతారాములు గత నాలుగు సంవత్సరాల కాలంలో యూనియన్ జరిపిన పోరాటాలు, సాధించిన విజయాల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. యూనియన్ నగర అధ్యక్షులు ఎం బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... వెల్ఫేర్ బోర్డు సాధించుకోవడానికి ముఠా వర్కర్స్ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తిండి, బట్ట, నివాసం, విద్యా, వైద్యం, పని కల్పన ఇవన్నీ అమలు కావాలంటే కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. పని ప్రదేశాలతో పాటు నివాస ప్రాంతాల్లో ముఠా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు నేతృత్వంలో ముఠా వర్కర్స్ యూనియన్ పని చేయాలని కోరారు. విద్యుత్ బిల్లుల తగ్గింపు, స్మార్ట్‌మీటర్ల రద్దు, పెరిగిన ధరలు తగ్గించాలని, పని కల్పన, కూలి రేట్లు పెంపుకు యూనియన్ ఇచ్చే పిలుపునకు కార్మికులు కలిసి కట్టుగా ముందుకు వచ్చి ఉద్యమించి సాధించుకోవాలని కోరారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ...కార్మికుల సమస్యలపై పని చేయడంతో పాటు ప్రజాసమస్యలపై జరిగే పోరాటాలకు ముఠా కార్మిక సంఘం వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. విశాఖలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు తదితరులు మాట్లాడారు. అనంతరం మహాసభ సందర్భంగా ముఠా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికయింది. 51 మందితో నూతన కమిటీ ఏర్పడింది. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం బ్రహ్మయ్య, ఎం సీతారాములు ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. కోశాధికారిగా సిహెచ్ దేవదాసు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఇవి నారాయణ, గౌరవాధ్యక్షులుగా వెల్లంకి కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యక్షులు ఏడుగురు, కార్యదర్శులుగా మరో పది మందితో... మొత్తం 51 మందితో నూతన కమిటీ ఏర్పడింది.



మహాసభకు హాజరైన కార్మికులు

పలు తీర్మానాలు...

పోలీసు, ఆర్‌టిఎ కేసులు రద్దు చేయాలని, సంక్షేమ భోర్డు కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని, జిఎస్‌టి వలన వచ్చే సమస్యలను కంపెనీలు డిస్ట్రిబ్యూటర్లు, కూలికి చెక్కులకు బదులు నగదు ఇవ్వాలని , వన్‌టౌన్, గవ్నర్‌పేట, గాంధీనగర్, హనుమాన్‌పేట తదితర సెంటర్లలో కూలి రేట్ల పెంపుకు పోరాటాలకు సిద్ధం కావాలని మహాసభ తీర్మానించింది.



దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- కలెక్టర్ లక్ష్మీశ, సిపి రాజశేఖరబాబు

ప్రజాశక్తి-విజయవాడ

పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని.. ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతత్వంతో ప్రతి పండగనూ జరుపుకుంటున్నామని.. ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయిచేయీ కలుపుదామని, జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ భక్తులకు విజయవాడ పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసే వారిపై పటిష్ట నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా ఉంటుందని తెలిపారు. బుడమేరు వరదల సమయంలో ఐక్యతా భావంతో బాధితులకు అండగా నిలిచామని.. ఇలాంటి స్ఫూర్తితోనే ముమ్మందుకూడా అడుగులు వేస్తామన్నారు. సమావేశంలో ఆర్‌డజీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎండబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు హాజరయ్యారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని ప్రభుత్వ సమీకృత బాలికల వసతి గహంలో గురువారం మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి బిందు మాధవి పాల్గొని మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందర్ రావు, న్యాయవాదులు ఎం ఆంజనేయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9899 ధరతో సామ్సంగ్ గెలాక్సీ ఎ06 5జి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :పండుగ సీజన్‌కు ముందు గెలాక్సీ ఏ06 5జి స్మార్ట్‌ఫోన్‌పై మునుపెన్నడూ చూడని ధరను ఏ06 5జి ప్రకటించిందని శాంసంగ్ రీజినల్ ఇంచార్జి జె.సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిమితకాల ఆఫర్‌లో భాగంగా గెలాక్సీ ఏ06 5జి కేవలం రూ.9899కే అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫీచర్ ఫోన్ లేదా 4జీ స్మార్ట్‌ఫోన్ నుండి గెలాక్సీ ఏ06 5జికి అప్‌గ్రేడ్ కావాలనుకునే వినియోగదారులకు ఈ డీల్ సరైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. గెలాక్సీ ఏ06 5జి కొనుగోలు చేసే వినియోగదారులు రూ.1399 విలువైన సామ్సంగ్ 25 వాట్స్ ట్రావెల్ అడాప్టర్‌ను కేవలం రూ.299కే పొందుతారని తెలిపారు. మరింత సరసమైన ధరను కోరుకునే వినియోగదారులు నెలకు కేవలం రూ.909 చెల్లించి స్మార్ట్‌ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చన్నారు.

ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు

- విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ

స్వచ్ఛోత్సవ, స్వచ్ఛత ఈ సేవ 2025లో భాగంగా, ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం రాఘవయ్య పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 64 వార్డుల్లో 64, 9 ప్రత్యేకమైన ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రతి సచివాలయంలో కూడా ఒక ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజలు ఆర్ఆర్ఆర్ కేంద్రం వద్దకు వచ్చి, వారికి అవసరం లేని స్టీల్ పాత్రలు, వస్త్రములు, పుస్తకాలు, కాగితాలు, చెప్పులు, షఉలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా సామాగ్రిని ఈ ఆర్ఆర్ఆర్ కేంద్రాలలో అందించవచ్చని, వాటి ద్వారా వ్యర్థాలను రెడ్యూస్ అంటే తగ్గించడం, రియూస్ అంటే మళ్ళీ వాడటం, రీసైకిల్ అంటే పునరుద్ధరించే చర్యలు అధికారులు తీసుకుంటారని తెలిపారు. అక్కడ ప్రజలు అందిస్తున్న పుస్తకాలను చూసి వారిని ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు అభినందించారు, తమ తోటి వారికి కూడా ఈ కేంద్రాల గురించి తెలియపరచాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.





వెదురుతో చేసిన కళాఖండాలు అద్భుతం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెదురు కార్మికులను గుర్తించి వారికి సబ్సిడీపై వెదురు బొంగులను అందజేసి వారికి న్యాయం చేస్తామనడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని 51, 53 డివిజన్ల కార్పొరేటర్లు మరుపిళ్ళరాజేష్, మహదేవ్ అప్పాజీరావు అన్నారు. గురువారం ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా గణపతి రావు రోడ్డులో ఆంధ్రప్రదేశ్ మేదరి (మహేంద్ర) సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు గ్రంధి మహేష్ ఆధ్వర్యంలో మేదర కుల గురువు కేతేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు రాజేష్, అప్పాజీ మాట్లాడుతూ వెదురుతో తయారు చేసిన కళాఖండాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లెపోగు ప్రసాదు, కనకదుర్గ విజయవాడ నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు నవిరి మహేష్, ఆరెకటిక సంఘ నాయకులు సూర్య కళ్యాణం ఉమామహేశ్వరరావు, మేదర సంఘ నాయకులు మొగ్గ శీను, పిల్లి మహేష్, గ్రంధి నాగేశ్వరావు, పాల్గొన్నారు.

ఆట స్థలం అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ పశ్చిమంలోని 50వ డివిజన్ కస్తూరి సీతారామయ్య ఎలిమెంటరీ మున్సిపల్ పాఠశాలలో ప్లేగ్రౌండ్ అభివృద్ధి, ఆట పరికరాలు ఏర్పాటు కోసం కార్పొరేటర్ బి సత్యబాబు గురువారం భూమి పూజ నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌కి గతంలో ప్లేగ్రౌండ్ అభివృద్ధి కోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ ద్వారా వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ మేరకు రూ.9 లక్షల వ్యయంతో అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పనులను సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని కోరారు. అలాగే నగరపాలక సంస్థ అన్ని పాఠశాలలో ఆట స్థలాలు, ప్లే ఎక్విప్మెంట్స్ అభివృద్ధి చేయాలని, పశ్చిమ నగరంలో ఇండోర్ స్టేడియం త్వరతగతిన పూర్తిచేసి విద్యార్థులు, యువకులకు క్రీడాకారులకు వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న బోయి సత్యబాబు

ఎఫ్ఎపై విచారణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన ఎఫ్ఎపై విసన్నపేట క్లస్టర్ ఎపిడిఓ గురువారం విచారణ చేపట్టారు. జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నందకు నగదు తీసుకున్నారని, పని చేయకుండానే హాజరు వేయడం, బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ అవ్వగా ఎఫ్ఎ తీసుకున్నాడని అభియోగాలపై విచారణ చేపట్టారు.

కొండపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొండపల్లి ప్రధాన రహదారి వరద నీటితో నిండిపోయింది. గంటపాటు కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. రహదారులపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.